క్లుప్తంగా

వంతెన నిర్మాణానికి స్థలం పరిశీలన



ఆర్ 8కాల్వపై వంతెన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న డీఈ భిక్షం తదితరులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డ ఎస్సీకాలనీలో గల ఎన్ఎస్పీ కెనాల్ ఆర్ 8కాల్వపై వంతెన నిర్మాణానికి మాజీ సర్పంచ్ అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్‌తో కలిసి నీటిపారుదల శాఖ డీఈ భిక్షం మంగళవారం స్థల పరిశీలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. వారి వెంట నీటిపారుదల శాఖ ఏఈలు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

రైతులు పంట కాల్వలను ఆక్రమించొద్దు

చిలుకూరు : రైతులు పంట కాల్వలను ఆక్రమించుకోవద్దని, దీంతో కాల్వ కింద రైతులకు నీళ్లు అందడం లేదని ఇరిగేషన్ ఏఈ మానస అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముక్యాల కాల్వను ఆమె పరిశీలించి మాట్లాడారు. రైతులు పంట కాల్వను సక్రమంగా ఉంచడంతో కింది రైతులు నీళ్లు సక్రమంగా అందుతాయని, రైతులు ఒకరికి ఒకరు సహకరించుకోవాలని సూచించారు. కాల్వ ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

పర్యావరణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నిర్వాహకులు

మఠంపల్లి : హుజూర్‌నగర్ పట్టణంలోని టౌన్ హాల్‌లో ఈ నెల 5న జరిగే అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని కార్యక్రమ కన్వీనర్ బాదె నర్సయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. పర్యావరణంపై ఆట, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తోట హుస్సేన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రతిరోజు యోగా చేయడంతో ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసంగా ఉంటుందని ఆయుష్ డిపార్ట్‌మెంట్ యోగా ఇన్‌స్ట్రక్టర్ బేతం రామానుజరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా డేలో భాగంగా ఆశా కార్యకర్తలు యోగాపై అవగాహన కల్పించి మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.


క్రీడా దుస్తుల పంపిణీ

నడిగూడెం : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న సమ్మర్ కబడ్డీ శిక్షణలో పాల్గొంటున్న 20మంది క్రీడాకారులకు స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎండీ.మౌలానా మంగళవారం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత మౌలానా మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎండీ.జానిమియా, మన్నెం నిరంజన్‌రెడ్డి, వీఎల్ఎన్.చారి, కోచ్ పల్లపు నాగేశ్వరరావు, సత్యనారాయణ, విజయరామారావు, వీరయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి

కోదాడరూరల్ : బక్రీద్ పర్వదినం సమీపిస్తున్నందున ముస్లింల శ్మశానవాటికను శుభ్రం చేసి మౌలిక వసతులు కల్పించాలని ఖబరస్థాన్ అడహాక్ కమిటీ ఇన్‌చార్జ్ ఎండీ.అతహర్ అన్నారు. మంగళవారం మున్సిపల్ మేనేజర్ రాబిన్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఖబరస్థాన్‌లో పెరిగిన కంపచెట్లను, పిచ్చి మొక్కలను తొలగించి వసతులు కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో షేక్ మహిమూద్, షేక్ జానీ, షేక్ షారు ఉన్నారు.

సైకిల్ ప్రేమికుడికి సన్మానం



బాబును సన్మానిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కోదాడరూరల్ : ప్రపంచ సైకిల్ డే సందర్భంగా కోదాడ పట్టణంలో నిత్యం సైకిల్‌పై ప్రయాణించే పేయింటర్ బాబును పందిరి ఫౌండేషన్ చైర్మన్ పందిరి నాగిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. పేయింటర్ బాబు 65 ఏళ్లుగా సైకిల్‌పై రోజుకు 5నుంచి 10కిలోమీటర్లు ప్రయాణిస్తూ ఆరోగ్యంగా ఉండడంతో పాటు పలువురి ఆదర్శంగా నిలుస్తున్నారని నాగిరెడ్డి అన్నారు. ప్రతిఒక్కరూ సైకిల్ తొక్కితే మంచి వ్యాయామం అవుతుందని బాబు అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌రావు, రాయపూడి చిన్ని, యాదగిరిరెడ్డి, జి.నాగేశ్వరరావు, బి.నాగేశ్వరరావు, జానీమియా ఉన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం

● అదనపు కలెక్టర్ పి.రాంబాబు



మునగాల : సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పి.రాంబాబు



హుజూర్‌నగర్‌రూరల్ : వేపలసింగారంలో దరఖాస్తులు పరిశీలిస్తున్న ఆర్డీఓ

మునగాల : ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఈ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని అదనపు కలెక్టర్ పి.రాంబాబు సూచించారు. మంగళవారం మండలంలోని కొక్కిరేణిలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుల భూసమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు ఎంతగానో తోడ్పడతాయన్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తారన్నారు. ఈ సదస్సులో కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ బుసిరెడ్డి రామకృష్ణారెడ్డి, ఆర్ఐ ఎస్.రామారావు, రెవెన్యూ సిబ్బంది సునీల్ గవాస్కర్, అశోక్, శ్రీను, ఎంపీఎస్ఓ సంపత్, రైతులు పాల్గొన్నారు.

కోదాడరూరల్ : భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని గణపవరంలో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సులో మిస్సింగ్ సర్వే నంబర్, భూమి ఎక్కువ ఉండి రికార్డులో తక్కువగా ఉండడం, పక్క రైతుల పాస్‌బుక్‌లో భూమి రికార్డు కావడం వంటి అనేక సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రైతులు తమ భూ సమస్యలను దరఖాస్తు రూపంలో అందజేసి పరిష్కించుకోవాలన్నారు. వివిధ రకాల భూ సమస్యలపై 59 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వాజిద్‌అలీ, నాయకులు ఇర్ల సీతరాంరెడ్డి, సింగారెడ్డి సుమన్‌రెడ్డి, పొట్టా కిరణ్, నారపరెడ్డి, జాబిశెట్టి నాగప్రసాద్,కోటయ్య, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : భూ భారతి రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ రైతులను కోరారు. మంగళవారం మండల పరిధిలోని తెల్లబెల్లిలో జరుగుతున్న రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించి అనంతరం రైతులతో మాట్లాడారు. సదస్సులలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా 35 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సదస్సులో తహసీల్దారు వి.సరిత, ఇన్‌చార్జ్ ఆర్ఐ రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ కళ్యాణి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సదస్సులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సురేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చింతలపాలెం మండలంలోని రేబల్లె గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 8మంది రైతులు వివిధ సమస్యలపై అధికారులకు దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐలు వాసుదేవరావు, ఆత్రేయ, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

హుజూర్‌నగర్‌రూరల్ : భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ కె.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని వేపలసింగారంలో హుజూర్‌నగర్ తహసీల్దార్ మండడి నాగార్జునరెడ్డితో కలిసి ఆయన రెవెన్యూ సదస్సును ప్రారంభించి మాట్లాడారు. ఈ సదస్సులో గ్రామంలో 47 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ మట్టయ్య, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, నాగమ్మ, విజయలక్ష్మి, రికార్డు అసిస్టెంట్, పలువురు రైతులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ సురిగి సైదులు అన్నారు. మంగళవారం మండలంలోని బొడలదిన్నె గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మౌనిక, రైతులు తదితరులున్నారు.

మఠంపల్లి : ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులతో భూసమస్యలు సత్వరమే పరిష్కారం చేసేందుకు అవకాశం కలుగుతుందని తహసీల్దార్ మంగా రాథోడ్ అన్నారు. మంగళవారం మండలంలోని అల్లీపురంలో ఆమె రెవెన్యూ సదస్సును ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బాలరాజు, ఆర్ఐ జానీపాషా, గ్రామ ప్రత్యేక అధికారి, ఏఎస్ఓ వల్లపుదాసు క్రాంతి, పంచాయతీ కార్యదర్శి నరేందర్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాలకవీడు : మండలంలోని మహంకాళీగూడెంలో మంగళవారం భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తహసీల్దార్ కమలాకర్ పాల్గొని మాట్లాడారు. గ్రామంలో 8 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సైదులు, బ్రహ్మచారి, ప్రేమ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేళ్లచెరువు : రైతుల భూ సమస్యలకు సత్వర పరిష్కారం అందిచనున్నట్లు తహసీల్దార్ నూకల రాజేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో 295 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీటీ శ్రీధర్‌నాయక్, సీనియర్ అసిస్టెంట్ జానకిరామిరెడ్డి, ఆర్ఐలు ముబీన్‌పాష, సుశీల, ఇందిర పాల్గొన్నారు.



కోదాడరూరల్ : గణపవరంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

అనంతగిరి : భూ భారతి రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ కె.హిమబిందు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లకారం గ్రామంలోని రైతువేదికలో భూభారతి సదస్సును ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కోదాడ మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బుర్ర సుధారాణి పుల్లారెడ్డి, ఆర్ఐ వెంకటనగేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, నర్సింహరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మోతె : రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలని మండల తహసీల్దార్ ఎం.వెంకన్న అన్నారు. మంగళవారం మండల పరిధిలో కూడలి, అన్నారిగూడెం గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మఠంపల్లి : అల్లీపురంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ మంగారాథోడ్



నడిగూడెం : తెల్లబెల్లిలో రెవెన్యూ సదస్సును పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ



హుజూర్‌నగర్ : సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ సురేందర్‌రెడ్డి



నేరేడుచర్ల : బొడలదిన్నెలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ సైదులు

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్ ప్రసన్న మంగళవారం తెలిపారు. ఈ విద్యాసంవత్సరం నుంచి ఎంపీహెచ్ డబ్ల్యూ, సీఈసీ గ్రూపులలో బోధించేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు, తెలుగు– 1, ఇంగ్లిష్– 1, సివిక్స్ –1, ఎకనామిక్స్ –1, కామర్స్ –1, నర్సింగ్ –1 పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఎమ్మెస్సీ, బీఈడీ అర్హత కలిగిన వారు ఈ నెల 4నుంచి 7వతేదీ వరకు తమ దరఖాస్తులను కాలేజీ స్పెషల్ ఆఫీసర్‌కు అందజేయాలని కోరారు. మండలంలోని మహిళా అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వారు పేర్కొన్నారు.

మఠంపల్లి : మండలంలోని బక్కమంతులగూడెం పరిధిలోని త్రివేణినగర్‌లో గల కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో నూతన ప్రవేశపెట్టిన జూనియర్ కళాశాలలో వివిధ సబ్జెక్ట్‌లో బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి వెంకటాచారి మంగళవారం తెలిపారు. మండలంలోని మహిళా అధ్యాపకులు ఈ నెల 4నుంచి 7వరకు కళాశాల ప్రిన్సిపాల్ ఒగ్గు విజయకుమారికి దరఖాస్తులు అందజేయాలని కోరారు.

మునగాల : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల జూనియర్ కళాశాల (ఇ.మీ)లో ఖాళీగా ఉన్న గెస్ట్ జూనియర్ లెక్చరర్ పోస్టులకు అర్హతగల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రత్యేక అధికారి పి.సునీతారాణి మంగళవారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో బోధించేందుకు అర్హత గల అభ్యర్థులు ఈ నెల 4నుంచి 7వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయా సబ్జెక్టులలో ఎంఎస్సీ బీఈడీ డిగ్రీ అర్హత ఉండాలన్నారు. తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ సబ్జెక్టులను ఒక్కొక్కరు చొప్పున ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్

పాలకవీడు : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసినట్లు ఎంఈఓ కాటయ్య, స్పెషల్ ఆఫీసర్ సుజాత మంగళవారం తెలిపారు. కాగా ఇంటర్ సీఈసీ, ఎంపీహెచ్ డబ్ల్యూ (ఎఫ్) గ్రూపులకు గాను ఒక్కో గ్రూప్‌కు 40 సీట్లు అందుబాటులో ఉన్నట్లు, అదే విధంగా జూనియర్ లెక్చరర్ పోస్టులకు గెస్టు పద్ధతిలో బోధించేందుకు మండలంలోని మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. తెలుగు01, ఇంగ్లిష్ 01, సివిక్స్ 01, ఎకనామిక్స్ 01, కామర్స్ 01, నర్సింగ్ 01 పోస్టులకు గాను ఈ నెల 6వ నుంచి 9వతేదీ వరకు కాలేజీ స్పెషల్ ఆఫీసర్‌కు దరఖాస్తులు అందించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



నేరేడుచర్ల : మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ అనిల్‌కుమార్

నేరేడుచర్ల : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో 'మన పిల్లల్ని మన ఊరి బడిలోనే చేర్పిద్దాం' అనే నినాదంతో ఏర్పాటు చేసిన జాతను కాంప్లెక్స్ హెచ్ఎం బట్టు మధుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో కార్పొరేట్ స్థాయిలో బోధన, డిజిటల్ తరగతి గదులు, లైబ్రరీ, ల్యాబ్‌లతో పాటు ఆహ్లాదకరమైన వాతవరణంలో ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకీడు యూటీఎఫ్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. శ్రీనయ్య, అక్కయ్యబాబు, నాగేశ్వర్‌రావు, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శేఖర్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సాంబయ్య, రవీందర్‌రెడ్డి, నాయకులు నర్సింహారావు, రాఘవారెడ్డి, యాదగిరి, వెంకటనర్సయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు.

మఠంపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలకు అర్హత కలిగిన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యాబోధన అందుతుందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాచకొండ దామోదర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారజాతాను జెండా ఊపి ప్రారంభించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు జే.కిరణ్‌బాబు, ఎం.రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి మేడి గోవిందు, జి.స్రవంతి, ఆర్ రామకృష్ణ, టి.కవిత, ఎం.చంద్రశేఖర్, సీహెచ్ నాగేశ్వరరావు, ప్రదీప్‌కుమార్, నరేష్, వి.లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదు పెంపుకు ప్రచార జాత

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో టీఎస్ యూటీఎఫ్ కోదాడ డివిజన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య పెంచేందుకు మంగళవారం ప్రచార జాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు తొడేటి బాబు, పాండురంగాచారి, శ్రీనివాసరావు, సైదిరెడ్డి, శ్రీను, మైసయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



నడిగూడెం : ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



మఠంపల్లిలో..

విత్తన స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యం



కోదాడరూరల్ : కాపుగల్లు రైతు వేదికలో విత్తనాలు అందజేస్తున్న అధికారులు, నాయకులు



గరిడేపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త మధుశేఖర్

కోదాడరూరల్ : అన్ని గ్రామాల్లో విత్తన స్వయం సమృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని కేవీకే శాస్త్రవేత్త సంధ్యారాణి అన్నారు. మంగళవారం మండలంలోని కాపుగల్లు రైతు వేదికలో ఎంపిక చేయబడిన ముగ్గురు అభ్యుదయ రైతులకు రాష్ట్రంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రాల నుంచి వచ్చిన వరి విత్తనాలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావుతో కలిసి పంపిణీ చేసి మాట్లాడారు. రైతులు ఈ నాణ్యమైన విత్తనాలను సాగు చేసి అధిక పంట దిగుబడి పొందాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌లు నంబూరి సూర్యం, ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, ఎంఏఓ పాలెం రజిని, ఏఈఓలు ఝాన్సీ, సల్మా, మహేష్, నగేష్, రైతులు అన్నెం పాపిరెడ్డి, నాగప్రసాద్, బొల్లు ప్రసాద్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రావు, వెంకన్న ఉన్నారు.

రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలి

మునగాల : రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలని శాస్త్రవేత్త రామకృష్ణ బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండల వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నాణ్యమైన విత్తనం – రైతన్నకు నేస్తం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వరి, పెసర పంటల్లో నాణ్యమైన విత్తనాన్ని వాడితే కనీసం 10నుంచి 15శాతం వరకు దిగుబడులు పెరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజు, విస్తరణాధికారాలు రమ్య, రేష్మ, నాగు, భవానీ రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి

నేరేడుచర్ల : రైతులందరూ నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేస్తేనే అధిక దిగుబడులు పొందుతారని మండల వ్యవసాయ శాఖ అధికారి జావిద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో చేపట్టిన నాణ్యమైన విత్తనం రైతులకు నేస్తం అనే కార్యక్రమం ప్రారంభించి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి పంటలో నాణ్యమైన విత్తనాలు వాడినప్పుడే 10 నుంచి 15శాతం దిగుబడి వస్తుందన్నారు.

గరిడేపల్లి : రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకొని అధిక దిగుబడులు పొందాలని ఏరువాక కేంద్రం నల్లగొండ జిల్లా శాస్త్రవేత్త రాజా మధుశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం అనే కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. విత్తనం ప్రాముఖ్యత, యూనివర్సిటీ నుంచి విడుదల చేయబడిన నాణ్యమైన విత్తనం ఉపయోగించడంలో లాభాలను, నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవడంతో 10నుంచి 15శాతం దిగుబడులు పెంచుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రీతంకుమార్, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనంతోనే పంట దిగుబడి



నేరేడుచర్ల : విత్తనాలు అందజేస్తున్న ఏఓ జావీద్

నడిగూడెం : నాణ్యమైన విత్తనంతోనే నాణ్యమైన పంట దిగుబడి వస్తుందని మండల మానిటరింగ్ అధికారి, వ్యవసాయ శాస్త్రవేత్త రామకృష్ణ బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విత్తనం లాభసాటి వ్యవసాయానికి సోపానం అనేక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలో విత్తన స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం నాణ్యమైన విత్తనాన్ని అందిస్తుందన్నారు. అనంతరం గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త కిరణ్ మాట్లాడుతూ.. నేల ఆరోగ్యంగా ఉండాలంటే సేంద్రియ ఎరువులైన పశువుల పెంట, వర్మికంపోస్టు, జీవామృతం, ఘన జీవామృతం వాడాలన్నారు. అనంతరం మండలానికి చెందిన 33మంది రైతులకు విత్తన కిట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ రాయపు దేవప్రసాద్, ఏఈఓలు పిచ్చయ్య, ఉప్పయ్య, రేణుక, రైతులు పాల్గొన్నారు.



మునగాల : విత్తనాలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

వానాకాలం పంటల సాగుపై అవగాహన

మునగాల : రైతులు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పంటలు సాగుచేసుకోవాలని భారత వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ వి.మానస, కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్త ఏ.కిరణ్ సూచించారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రాబోయే వానాకాలం పంటల సాగు యాజమాన్య పద్ధతులపై వారు రైతులకు అవగాహన కల్పించారు. రానున్న వానాకాలం సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని పంటల సాగులో సుస్థిరమైన పద్ధతులు, శాస్త్రీయతపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు, పంట ఉత్పత్తి, నేల ఆరోగ్యం, వనరుల నిర్వహణను మెరుగుపరచడంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త రామకృష్ణబాబు, భారత వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయాధికారి బుంగా రాజు, కోదాడ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల కోటేశ్వరరావు, వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు రమ్య, రేష్మ, భవాని, నాగు, రైతులు యాదగిరి, వెంకట్‌రెడ్డి, నగేష్, కోటిరెడ్డి, నాగయ్య, వీరారెడ్డి, సైదులు, కపిల్, రామయ్య, అరవింద్, మల్లయ్య, రాధాకృష్ణ, కృష్ణ, శ్రీనివాస్, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరి నారుమడిలో యాజమాన్యంపై..

గరిడేపల్లి : మండలంలోని గానుగబండ, గారకుంట తండా గ్రామాల్లోని రైతువేదిక, పంచాయతీల్లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వానాకాలం సీజన్‌లో నూతన వరి వంగడాల ఎంపిక చేసుకోవడం, వరినారు మడిలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై ఐకార్ నార్మ్ డైరెక్టర్ గోపాల్‌లాల్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్తలు వెంకటకుమార్, నిర్మల, పద్మావతి, సుమన్, కేవీకే శాస్త్రవేత్తలు డి.నరేష్, సీహెచ్ నరేష్, సుగంధి, మండల వ్యవసాయ అధికారి ప్రీతంకుమార్ తదితరులు పాల్గొన్నారు.



గరిడేపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న ఐకార్ నార్మ్ డైరెక్టర్ గోపాల్‌లాల్

రిటైర్మెంట్ వయస్సు, బెనిఫిట్స్ పెంచడం హర్షణీయం



సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు, అంగన్‌వాడీ సిబ్బంది

హుజూర్‌నగర్ : ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల రిటైర్మెంట్ వయస్సు, బెనిఫిట్స్ పెంచడం హర్షణీయమని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురువయ్య, బ్లాక్ అధ్యక్షుడు చిట్యాల అమర్నాథ్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం పట్టణంలోని ఇందిరా సెంటర్‌లో ఐఎన్‌టీయూసీ అనుబంధ ఇందిరా ప్రియదర్శిని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్, సీతక్క చిత్రపటాలకు పాలాభిషేకం చేసి మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం వారు మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ రిటైర్మెంట్ వయస్సు 60నుంచి 65 ఏళ్లకు పెంచడం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.లక్ష నుంచి రూ.2లక్షలు ప్రకటించడం హర్షనీయమన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు ఎం.ముక్కంటి, నాయకులు ఎస్.జానయ్య, ఎం.నాగేందర్, యూనియన్ అధ్యక్షురాలు శాంతరాజ్యం, రాములమ్మ, సునిత కుమారి, సుధారాణి, కళ్యాణి, సుజాత, రేణుక, అక్కమ్మ, తిరుపతమ్మ పాల్గొన్నారు.

బీసీ యువత అన్ని రంగాల్లో ముందుండాలి

హుజూర్‌నగర్ : బీసీ యువత అన్ని రంగాల్లో ముందుండాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని రెండో వార్డు ఆ సంఘం యూత్ అధ్యక్షుడిగా వేముల అఖిల్ నియమిస్తూ స్థానిక బీసీ భవన్‌లో నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో గోవిందరావు, దీప, నరసింహచారి, అజయ్‌కుమార్, నాగేశ్వరరావు, యుగంధర్, ఆచారి, శ్రీనివాస్, హనుమాచారి, శ్రీనివాస్, వెంకటరత్నం, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

మునగాల : మండలంలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన గీత కార్మికుడు కాసాని వీరయ్య మంగళవారం ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కోదాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి, మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.